వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నవంబర్‌లో తెగుళ్లు ఆశించే ప్రమాదం



వరిలో సుడిదోమ తెగులు సోకిన వరి పంట

గుంటూరు రూరల్: ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో పంటలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టటం వలన పంట నష్టపోకుండా మంచి దిగుబడులు సాధించేందుకు అవకాశాలున్నాయి. ఈ దశలో వరిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులు తెలుసుకుని సరైన సమయంలో పాటించి మంచి దిగుబడులను పొందవచ్చని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. నవంబర్‌లో మంచుపడే వాతావరణం ఎక్కువగా ఉండటం వలన వరి పంటల్లో దోమపోటు, మానిపండు తెగులు, మెడవిరుపు తెగులు ఆశించే అవకాశాలున్నాయి వాటిని సమర్థంగా ఎదుర్కొంటే పంటను కాపాడుకోవచ్చు.



వరిలో మానిపండు సోకిన వరి దుబ్బు

సుడి దోమ నివారణకు..

వరిలో గోధుమ వర్ణం, లేదా తెల్ల వీపు మచ్చల దోమలు దుబ్బుల అడుగున నీటి మట్టంపై ఉండి దుబ్బులనుంచి రసాన్ని పీలుస్తాయి. దీంతో వరిపంట సుడులుసుడులుగా తిరిగి ఎండిపోతుంది. పంట ఈనే దశలో దుబ్బుకి 20-25 పురుగులు ఉన్నట్టయితే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఈ దోమ కనిపించిన పొలంలో అప్పుడప్పుడు నీటిని వెళ్లబెట్టి పంటను ఆరబెట్టాలి. దోమ నివారణకు ఎసిఫేట్ 75ఎస్‌పీ 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్‌తోపాటుగా ఎథిప్రోల్ 80 డబ్ల్యుజి 0.25 గ్రాములు, లేదా పైమెట్రోజైన్ 50 డబ్ల్యూజీ 0.6 గ్రాములు లేదా ఫ్లానికామిడ్ 50 ఎస్‌జీ 0.4 గ్రాములు, లేదా నోట్రైఫ్యూరాన్ 20ఎస్‌జి 0.4 గ్రాములు లేదా ట్రిఫ్లూమిజోపైరిమ్ 10 ఎస్‌సీ 0.48 మిల్లీ లీటర్లు లీటరు నీటిని కలిపి పంటలపై పిచికారి చేయాలి. దోమ ఉధృతిని బట్టి దోమ పెరుగుదలకు దోహదపడే పురుగు మందులైన ప్రొఫెనోఫాస్, మిథైల్‌పరాథియాన్, ఫోరేట్ 10 జి గుళికలను, సింథటిక్ పైరిత్రాయిడ్ వర్గానికి చెందిన డెల్టామైత్రిన్, సైఫర్ మైత్రిన్ తదితర మందులను వాడరాదు.

మానిపండు తెగులు నివారణ చర్యలు..

ఈ తెగులు వరి పుష్పించే దశలో ఆశిస్తుంది. అండాశయంలో శిలీంద్రం పెరుగుదల వల్ల పసుపు పచ్చరంగు ముద్దగా అభివృద్ధి చెంది ఆకుపచ్చరంగులోకి మారుతుంది. చివరకు నల్లబడిపోతుంది. గింజ స్థానంలో శిలీంద్ర బీజ సముదాయం ఏర్పడుతుంది. ఇది వరి పొట్టదశ నుంచి పూత దశలో గాలిలోని తేమ శాతం ఎక్కువగా ఉన్న, మంచు, మబ్బులతో కూడిన వర్షపు జల్లులు ఈ తెగులు సోకేందుకు అనుకూలమైన సమయాలు. రైతులు విత్తనాలు సేకరించే సమయంలోనే ఈ తెగులు సోకని పంట నుంచి విత్తనాలు సేకరించాలి. ముందు జాగ్రత్తగా తెగులు నివారణకు ప్రొఫికోనజోల్ 25 ఈసీ లీటరు నీటికి కలిపి పొట్టదశలో, ఎన్ను పైకి వచ్చే దశలో సాయంకాలం సమయంలో మాత్రమే పంటలపై పిచికారి చేయాలి.



వరిలో మెడవిరుపు తెగులు సోకిన పంట

మెడవిరుపు తెగులు నివారణ చర్యలు

వరిపంటలో ఎన్నుల మెడభాగంలో ఈ తెగులు ఆశించటం వల్ల ఎన్నులు విరిగి కిందకు వాలిపోతాయి. దీని వల్ల ఎన్నులలో తాలు గింజలు, సగం నిండిన గింజలు ఏర్పడి పంటకు నష్టం కలిగిస్తాయి. ఒక వారం రోజులపాటు రాత్రి ఉష్ణోగ్రతలు 18-20 డిగ్రీలు ఉండటం, లేదా గాలిలో తేమ 90 శాతం ఉండటం, లేదా ఎక్కువ వర్షపు జల్లులు పడటం, మంచు అధికంగా ఉండటం నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ ఇటువంటి పరిస్థితులు ఈ తెగులు ఆశించేందుకు సరైన సమయం. పంటల్లో నత్రజని ఎక్కువగా ఉన్నపుడు ఈ తెగులు త్వరగా ఆశిస్తుంది. దీని వల్ల పంట నష్టం ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులు నివారణకు ఎకరానికి 120 గ్రాముల ట్రైసైక్లోజోల్ 75 శాతం, లేదా 300 మిల్లీ లీటర్లు వెసోప్రొథమోలిన్ లేదా 500 మిల్లీ లీటర్లు కాసుగామైసిన్ 3 ఎల్‌ను లీటరు నీటికి కలిపి పంటలపై పిచికారి చేసుకోవాలి. ప్రతిరోజు పంటను ఉదయం సాయంత్రం గమనించుకుంటూ సరైన యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను కాపాడుకోవచ్చు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ప్రస్తుతం గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల, మంచు పడే సమయం ఉంది. కనుక వరి పంటల్లో రైతులు సత్వర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ పంటలను తెగులు సోకకుండా జాగ్రత్తగా యాజమాన్య పద్ధతులు పాటించి పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చు. వాతావరణంలోని మార్పుల వల్ల ఈ తెగుళ్ళు ఆశించి రైతులు ఎక్కువగా నష్టపోతుంటారు. సకాలంలో రైతులు స్పందించి పంటనష్టాన్ని జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎం వెంకటరాములు, లాంఫాం ఏరువాక కేంద్రం విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త

క్లుప్తంగా

నేటి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ

చేబ్రోలు: మండల ప్రజా పరిషత్, చేబ్రోలు పంచాయతీరాజ్ వ్యవస్థలలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికలు తయారు చేయటకు గాను రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.లలిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలకు, బుధవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. స్థానిక సంస్థలలో 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాతిపదికన ప్రణాళికలను తయారు చేసుకొని అమలు చేయటం కోసం పంచాయతీ సంస్థలు కీలక ప్రాత వహిస్తాయని ఎంపీడీఓ పేర్కొన్నారు.

రంగవల్లులతో గ్రామ స్వరూపం



ప్రత్తిపాడు: బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వట్టిచెరుకూరులో నివాసం ఉంటూ రైతులకు వ్యవసాయంలో వస్తున్న సాంకేతిక మార్పులు, లాభసాటి వ్యవసాయంపై వివరిస్తున్నారు. పంట పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడి వ్యవసాయంపై తమకు తెలియని విషయాలను తెలుసుకోవడంతో పాటు, తమకు తెలిసిన విషయాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం గ్రామంలోని సిమెంట్ రోడ్డుపై గ్రామ వీధులు, పంటల స్వరూపాన్ని తెలియజేసేలా రంగవల్లులతో గ్రామ స్వరూపాన్ని అందంగా గీశారు. రైతులకు గ్రామంలో వ్యవసాయ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఎక్కడెక్కడ పంటలు సాగు చేశారు, చెరువులు, ఇళ్లు.. తదితరాలను వివరించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఉద్యోగులకు అవగాహన

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై జీఎంసీ ఉద్యోగులకు పోస్టల్ డిపార్ట్‌మెంట్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఇన్సూరెన్స్, పొదుపు కోసం మెరుగైన పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని, అదే విధంగా సోలార్ విద్యుత్(పీఎం సూర్య ఘర్) పథకాలను జీఎంసీ ఉద్యోగులు పరిశీలించి అనుకూలమైన వాటిని తీసుకోవాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుంచి పోస్టల్ అసిస్టెంట్ షాహెదా, సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసరావు హాజరై ఉద్యోగులకు అవగాహన కల్పించారు.

14న వ్యాసరచన పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని జేకేసీ కళాశాలలో ఈనెల 14వ తేదీ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ వలన సమాజానికి లాభమా!. నష్టమా!. అనే అంశంపై తెలుగు, ఆంగ్ల భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించి తొలి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులను అనుమతిస్తామని, ఆసక్తి గలవారు వారి కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలు..

జేకేసీ కళాశాల మహిళా సాధికారత సమితి ఆధ్వర్యంలో భవిష్యత్ కోసం అమ్మాయిల దృష్టి అనే అంశంపై ఈనెల 15న రాష్ట్ర స్థాయిలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ గోపీచంద్ తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు ఐడీ కార్డు, రిజిస్ట్రేషన్ రుసుం రూ.50, ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో చలమయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూలో ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు చలమయ్య-కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. సంగడిగుంటలోని కళాశాలలో సోమవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 81 కేజీల మహిళల విభాగంలో టి.నాగజ్యోతి, పురుష విభాగంలో షేక్ అబ్దుల్ మతీన్ రజత పతకాలు సాధించారని తెలిపారు. కళాశాల కార్యదర్శి కర్నూరపు రామకృష్ణప్రభు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం ప్రావీణ్యం పొంది, విజయం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోచ్ ఎండీ కమ్రుద్దీన్, ప్లేస్‌మెంట్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



ప్రత్తిపాడు: గ్రామాల్లో దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా కార్యాలయం సబ్ యూనిట్ ఆఫీసర్ కె.ప్రశాంత్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో కలసి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. తాగు నీటి గాబులు, ఖాళీ ప్రదేశాల్లో ఉన్న నీటిలో దోమల లార్వా ఉందా? లేదా? అన్న విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరాల బాధితులను గుర్తించి రక్తపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దోమ లార్వా పెరగకుండా స్థానిక పంచాయతీ అధికారులతో కలిసి చర్యలు తీసుకోవాలని సూచించారు.

నల్లపాడు అగస్త్యేశ్వరాలయంలో కార్తిక పూజలు

గుంటూరు రూరల్: నల్లపాడులోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని స్వామికి విశేష అలంకార దర్శనం నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుండి భక్తులు స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు ఉదయం తెల్లవారుజామునే మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దేవాలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

కాకుమాను: భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జీవితాన్ని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక ఉర్దూ పాఠశాలలో సోమవారం మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమని, విద్య వలన సామాజంలో మనిషి విలువ, సామాజిక మార్పు సాధ్యపడుతోందని తెలిపారు. ఆజాద్ ప్రఖ్యాత రచయిత, కవి అని ఆయన తెలిపారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా పని చేసి విద్యారంగంలో దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా ఏటా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.



అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓలు కెనడీ, విజయ్ భాస్కర్

కర్రసాము పోటీల్లో సెయింట్‌ఆన్స్ ప్రతిభ

గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతోపాటుగా క్రీడలు, రక్షణ విద్యల్లో ప్రావీణ్యత అవసరమని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. సోమవారం గోరంట్లలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థినుల అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల నగరంలోని టీజేపీఎస్ కళాశాలలో నిర్వహించిన సౌత్‌జోన్ చాంపియన్‌షిప్-2024 క్రీడా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ శిలాబం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్రసాం పోటీలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి రజత, కాంస్యపతకాలు సాధించారన్నారు. కళాశాల పీడీలు జి.బాలశౌరిరెడ్డి, కె.సుస్మిత, కోచ్ కె.వెంకట్, ఎం.లక్ష్మీప్రసన్న పర్యవేక్షణలో విద్యార్థినులు ఎల్.రజిత, టి.సుమతి, సీహెచ్ దేవరాజరాణి, ఎం.ప్రవణ్య పతకాలను సాధించారన్నారు. పథకాలను సాధించిన విద్యార్థినులకు టీజేపీఎస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తులసి సంస్థల అధినేత తులసి రామచంద్రప్రభు చేతుల మీదుగా బహుమతులు అందజేశారన్నారు.



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న తులసీ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు

అంకెలగారడీ బడ్జెట్

పొన్నూరు: అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ కేవలం అంకెలు గారడీనే తప్ప ఆచరణకు సాధ్యపడదని కాంగ్రెస్ పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర విభజన అనంతరం కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మోదీ లాంటి నియంత దేశ ప్రధానిగా ఉండటం మన రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యమని విమర్శించారు. ఆదాయమే లేని రాష్ట్రానికి రెండున్నర లక్షల కోట్ల అంచనాతో బడ్జెట్ ప్రవేశపెట్టడం రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడమేనని, పదేళ్లుగా ఇదే జరుగుతుందని, నేటి బడ్జెట్ కూడా అంకెల గారడీ నే తప్ప ఆచరణకు సాధ్యం కాదని అన్నారు.

నేడు హోటల్ యజమానులతో సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్, ఫంక్షన్ హాల్స్ ఉన్న హోటల్స్ యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో వ్యర్థాల నిర్వహణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలో బల్క్‌గా వ్యర్థాలు ఉత్పత్తి జరిగే కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్, హోటల్స్ నిర్వాహకులకు వ్యర్థాల నిర్వహణ, తడిపొడి విభజన అంశాలపై అవగాహన కలిగించేందుకు నగరపాలక సంస్థ తరఫున ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం

తహసీల్దార్ జియా వుల్ హక్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియా

పొన్నూరు: వివిధ సమస్యలపై మండల ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ జియా వుల్ హక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి

ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి మంజూరు చేసిన నిధులతో చేపట్టాల్సిన పనులను వెంటనే ప్రారంభించాలని తహసీల్దార్ జియా, ఎంపీడీఓ చంద్రశేఖరరావు అన్నారు. మండలంలో జరుగుతున్న హౌసింగ్, ఉపాధిహామీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడీ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో రూ.6 లక్షల17 వేలతో 17 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయ్‌లెట్లు, రూ.3 లక్షల 40 వేలతో 20 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 16 కేంద్రాల్లో రూ.లక్ష 60 వేలతో ఆకు కూరల మొక్కలు పెంచి కేంద్రాలకు సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు. గ్రామాల్లో చేపడుతున్న 19 సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లలో ప్రస్తుతం 7 ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

ప్రత్తిపాడు: వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజంపాడు కిట్స్ కళాశాలలో అటల్, ఏఐసీటీఈ సహకారంతో వారం రోజుల పాటు ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో మెషిన్ లెర్నింగ్ ఉపయోగించి వైర్లెస్ సెన్సార్ నెట్‌వర్క్ ఆధారిత అగ్రికల్చర్ సిస్టమ్‌లో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించారు. ఆరు రోజుల పాటు జరగనున్న కార్యక్రమానికి తొలి రోజు ముఖ్య అతిథులుగా రిసోర్స్ పర్సన్‌లు డాక్టర్ బి.తరుణ్ కుమార్ రెడ్డి (ఐఐటీ రూరికే), డాక్టర్ టి.కిషోర్‌కుమార్ (ఎన్ఐటీ వరంగల్) హాజరయ్యారు. ఆధునిక టెక్నాలజీ సహకారంతో వ్యవసాయంలో చోటుచేసుకున్న విప్లవాత్మక మార్పులను వివరించారు. అధ్యాపకులు నూతన సాంకేతికతను తెలుసుకుని, విద్యార్థులతో దేశానికి ఉపయోగపడేలా వ్యవసాయ రంగంపై నూతన ఆవిష్కరణలను తయారు చేసేలా తీర్చిదిద్దాలని సూచించారు. కళాశాల చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ అధ్యాపకులు నిత్య విద్యార్థులేనని, ఎప్పటికప్పుడు సరికొత్త విషయాలను తెలుసుకుంటూ తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలని చెప్పారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు, ఈసీఈ విభాగాధిపతి ఎన్.ఆదినారాయణ, ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సరళ పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్‌ఎస్(ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరణ) నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 17 ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో వీధి దీపాల సమస్యలు 24 గంటల్లో పరిష్కరించాలని చెప్పారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతి పర్యవేక్షణకు కమిషనర్ చాంబర్‌లో ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయిస్తామన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్జీలు బీ అండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లడానికి వీలులేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలని కోరారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 63 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 19, ఇంజినీరింగ్ విభాగానికి 21, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 7, అకౌంట్స్ విభాగానికి 12, ఉపా సెల్ 5, పరిపాలన విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

వెండింగ్ జోన్ల ఏర్పాటుకు సహకరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నూతన వెండింగ్ జోన్ల ఏర్పాటుకు వీధి వ్యాపారులు, ఆయా సంఘాల ప్రతినిధులు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారుల సమస్యలు, వెండింగ్ కమిటీ ఏర్పాటు, వెండింగ్ జోన్ల నిర్ధారణ తదితర అంశాలపై వెండింగ్ కమిటీ సభ్యులు, ట్రాఫిక్, ఆర్ అండ్ బీ, ట్రాన్స్‌పోర్ట్, మెప్మా, సీపీడీసీఎల్, నగరపాలక సంస్థ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత వీధి వ్యాపారులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, జోన్ల ఏర్పాటు, గుర్తింపు కార్డుల పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకొని మాట్లాడుతూ వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి, వారికి మెరుగైన సంక్షేమ చర్యలు తీసుకోవడానికి ముందుంటామన్నారు. కాని వీధి వ్యాపారుల దగ్గర అద్దెలు పేరుతో దోచుకుంటున్న దళారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కమిటీ ఏర్పాటు అనంతరం డిసెంబర్ 10 నాటికి జోన్లను ఫైనల్ చేసుకునే లక్ష్యంతో స్థలాల పరిశీలన చేయాలన్నారు. రోడ్లు, ఫుట్ పాత్‌లు, డ్రెయిన్ల ఆక్రమణలను దశల వారీగా తొలగిస్తామన్నారు. తొలగించిన ప్రాంతాల్లో వాస్తవంగా వీధి వ్యాపారాలు చేసుకునే వారు అర్జీలు ఇస్తే వారికి తాత్కాలికంగా వ్యాపారం చేసుకోవడానికి స్థలాన్ని కేటాయిస్తామన్నారు. ఈ నెల 14 నుంచి జీఎంసీ ప్రధాన కార్యాలయంలో వీధి వ్యాపారుల గుర్తింపు దరఖాస్తులను ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అందిస్తామని, వీధి వ్యాపారులు దరఖాస్తు పూర్తి చేసి, అదే కౌంటర్‌లో అందిస్తే వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఉపా సెల్ పీఓ జె.రామారావు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

నెహ్రూనగర్: డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు నుంచి హైదరాబాద్, తెనాలి, విజయవాడ, విశాఖపట్నం రూట్‌లలో తిరగుతున్న బస్సుల గురించి, సిబ్బంది పనితీరుపై ప్రయాణికులు, విద్యార్థుల నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959225421కు ఫోన్ చేయాలని సూచించారు.

విద్యతోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చు

డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్: గుంటూరు పొన్నూరు రోడ్డు సంగడిగుంటలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల(మైనారిటీ బాలికలు)లో నేషనల్ ఎడ్యుకేషన్ డే వేడుకలు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి(ఎం హెచ్‌పీఎస్) రాష్ట్ర ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు డాక్టర్ షమ సుల్తానా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు విద్య ప్రాధాన్యత, విద్య వల్ల సమాజంలో కలిగే గౌరవ ప్రతిష్టలను డాక్టర్ షమ సుల్తానా వివరించారు. కార్యక్రమంలో సంగడిగుంట ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంహెచ్‌పిఎస్ సభ్యులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల బాలిక అదృశ్యం

లక్ష్మీపురం: నాలుగేళ్ల బాలిక అదృశ్యంపై సోమవారం లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రాజేష్, పద్మ ఇద్దరు ఈ నెల 9వ తేదీన పాత బస్టాండ్ సమీపంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రాంతానికి కుమార్తె మూడవత్ తేజస్విని తీసుకొచ్చారు. బాలికను షాపింగ్ మాల్ పక్కన మెట్ల మీద కూర్చోబెట్టి వారు టిఫిన్ కోసం వెళ్లారు. పరిసర ప్రాంతాలలో వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో సీఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. ఆచూకి కోసం గాలిస్తున్నారు.

రేపు ఉపకార వేతనాలు పంపిణీ



తులసి యోగీష్

కొరిటెపాడు: షెడ్యూల్డ్ తెగలకు చెందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు బుధవారం పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ సోమవారం తెలిపారు. ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ 17వ వార్షికోత్సవం సందర్భంగా కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ గుంటూరు, ప్రతిస్పందన ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ చర్ల సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 200 మంది షెడ్యూల్డ్ తెగలకు చెందిన విద్యార్థులకు రూ.7 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమం ఉమ్మడి ఖమ్మం జిల్లా, చర్లలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతోందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై విద్యార్థులకు వితరణ చేయనున్నట్లు తెలిపారు.